# బంగారుతల్లి

సిస్టర్... సిస్టర్.... సిస్టర్... పిలిచానో... పిలుద్దామనుకున్నానో... మూలిగానో ఖచ్చితంగా నాకు తెలీట్లేదు. గుండెల్లో మాట పైకి వస్తోందో... గొంతులో అణగారి పోతోందో....

కాసిన్ని మంచినీళ్ళు కావాలి- ఎవరందిస్తారు?

ఎవరిస్తారు?

"సి.. స్ట..ర్!" పిలవలేకపోతున్నాను.

నా కళ్ళు సిస్టర్ వచ్చే దారికేసి ఆత్రంగా ఆశగా చూస్తున్నాయి... ఆ చూపులు తిరుగుతూ తిరుగుతూ... పక్క బెడ్ పేషెంట్ అటెండెంట్ మీద ఆగాయి- ఆవిడ సిస్టర్ని పిలిస్తే ఎంత బాగుంటుంది.. అడగడానికి ఓపిక లేదు... అడిగేంత ధైర్యమూ లేదు... అచ్చం మా అమ్మలా వుంది ఆవిడ- 'అమ్మ' అన్నాను. మూలుగుతూనా? ఆ అమ్మని పిలవడమా?? మా అమ్మని పిలవటమా??? మా అమ్మ ఎందుకొస్తుంది? రాదు!!

అమ్మకి నేనెప్పుడో చచ్చిపోయాను- మరీవిడ కూడా అమ్మలాగే వుందే... నాకింకేం తెలియట్లేదు... నా మంచం గుండ్రంగా తిరుగుతోంది.

నేనూ అంతే మంచంపైన కొన్ని అడుగుల ఎత్తున గది చుట్టూరా తిరుగుతున్నాను.. ఆ తర్వాతేమైందో తెలీదు.

✦ ✦ ✦

నాన్న చనిపోయాడని తెల్సి నేనూ మా సరస్వతీ వెళ్లాం- శవాన్ని కూడా చూడ్డానికి వీల్లేదని గెంటేశారు మమ్మల్ని. సరస్వతి అంటే వాళ్లకి కోపం- నామీద కోపంకన్నా మించిన అసహ్యం-

మా మావయ్య కూతుర్ని కాదని చనిపోయిన మా ఫ్రెండ్ చెల్లాయిని పెళ్లి చేసుకున్నాను. మా అమ్మా నాన్నా మండిపడ్డారు. చాలా రోజులు ప్రయత్నాలు చేసాం. వాళ్ల పంతం తగ్గలేదు- మూడేళ్లు ఒకే వూళ్లో ఉండీ మొహమొహాలు చూసుకోలేదు. ఈ లోగా నాన్న పోయారు- అమ్మ?? అమ్మకే 'అసలు' కోపం-

నాకు అమ్మంటే ఎంతిష్టమో తనకీ తెల్సు- అందుకే ఇన్ని ఒట్లు పెట్టి- అన్ని తిట్లు తిట్టి... నన్ను వంచుదామనుకుంది. నాన్న పోయినా నన్ను గుమ్మంలోకి రానియ్యలేదు... మా అన్నయ్యల్తో మమ్మల్ని గెంటించేసింది. సరస్వతే నన్ను కన్నతల్లిలా ఓదార్చింది-

సరస్వతికి కష్టం తెల్సు. బాధ తెల్సు. తనని తాను ఓదార్చుకోవటం తెల్సు- తల్లీ తండ్రీ లేకపోయినా అన్నా చెల్లెలూ... ఒకళ్లకొకళ్లు అమ్మానాన్నల్లా ఉండేవాళ్లు. విధి నాన్నలాంటి అన్నయ్యని లాక్కెళ్లిపోయాక ఆమె దుఃఖం చూళ్లేక పోయాను. నీకు నేనున్నాను.. అన్నాను. నాకింక తనొక్కతే మిగిలింది. నా చెయ్యి పట్టుకుంది. నిజానికి అప్పటికి నాకు ఉద్యోగం లేదు. సరస్వతి సింగిల్ టీచర్ స్కూల్‌లో ఉద్యోగం చేస్తోంది. ఊరుకి దూరంగా విసిరేసినట్టున్న హరిజనవాడ పిల్లలకి జిల్లా పరిషత్తు సమకూర్చిన సదుపాయం ఆ స్కూలు- కొన్నాళ్లకి నాకో చిన్న ఉద్యోగం వచ్చింది. వేణ్నీళ్లు చన్నీళ్లులా కల్సి వెచ్చగా బతికేస్తుండగా...

ఇదిగో ఇప్పుడు నాకు జ్వరం... టైఫాయిడన్నారు. రాజమండ్రి వెళ్లి హాస్పిటల్‌లో చేరాలన్నారు. అదే నయం.

సరస్వతి నన్ను చూసుకుంటూ ఉండలేదు. సెలవు పెట్టడానికి లేదు. రోజూ స్కూలవగానే 5 గంటలకి బైల్దేరి రెండు బస్సులు పట్టుకుని రాజమండ్రి వస్తుంది. హాస్పిటల్లో ఓ రెండు మూడు గంటలు ఉండి రాత్రి 10 గంటలకి ఇంటికి చేరుతుంది. మళ్లీ తెల్లారేప్పటికి స్కూల్ హడావుడి కదా. పాపం చాల అలిసిపోతోంది.. కానీ తప్పదు.

నేను ఏమైనా అయిపోతే పాపం సరస్వతి ఏమైపోతుంది... మళ్లీ పెళ్లి చేసుకోమనాలి. అలాంటి పాడు మాటలు అంటే ఏడుస్తుంది.. కొడుతుంది కూడాను... ఛీ జ్వరానికి ఇంత భయపడుతున్నానేంటి... త్వరగా తగ్గిపోతుంది. తగ్గిపోవాలి. ఇంటికెళ్లిపోవాలి. నిజంగా తగ్గుతుందా? ఇంటికెళ్తానా?... ప్రాణం పోయాక ఇంటికి తీసుకెళ్తారా... అమ్మ చివరిసారైనా నన్ను చూడ్డానికి వస్తుందా? ఏమో... వచ్చినా నాకు తెలియదు కదా? ఏంటో భయం వేస్తోంది... నాలిక తడారిపోతుంది.

అమ్మా...

మూలుగుతున్నానా... అమ్మని పిలుస్తున్నానా... నాకే తెలియట్లేదు. కన్నీళ్లో, చెమట్లో తుడుచుకుని కష్టంగా లేచి కూచున్నాను.

"సిస్టర్... సిస్టర్" పిలిచాను. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఆవిడకి వినిపించలేదు. వినిపించేలా అరిచే ఓపిక లేదు. పక్క బెడ్ అటెండెంట్ కేసి జాలిగా చూసి కళ్లు మూసుకున్నాను. మగతలోకి జారిపోయాను.

+ + +

సిస్టర్ చల్లటి గుడ్డతో మొహం తుడుస్తుంటే కళ్లిప్పాను.

సిస్టర్ ప్రక్కన ఆ పెద్దావిడ ఆందోళనగా చూస్తూ సిస్టర్‌ని

మందలిస్తోంది.

"అతను నిన్ను పిల్చి పిల్చి అలిసిపోయాడు- కొంత ఎలర్ట్‌గా వుండాలి కదమ్మా"

"మాకీయనొక్కడే పేషెంట్ కాదు కదండీ... పేషెంట్ ప్రక్కనో అటెండెంట్ ఉంటే మాకూ వాళ్లకీ ఇంత టెన్షన్ ఉండదు" విసురుగా అంది సిస్టర్.

"మీకు టెన్షన్... ఉంటే బాగానే వుండేది"

వినీ వినిపించకుండా విసుక్కుంది పెద్దావిడ.

నాకు గ్లూకోజు నీళ్లు తాగించింది.. కాసేపాగి సెలైన్ పెట్టింది.

అక్కణ్నుంచి ఆ పెద్దావిడ నా బెడ్‌కీ పక్క బెడ్‌కీ మధ్య తిరుగుతూ ఎవరికేం కావాలో చూసుకుంది.

"పక్క బెడ్‌లో ఉన్నావిడ ఎవరూ? మీ అక్కయ్యగారా" అన్నాను కాస్త త్రాణవచ్చాక.

"మేమిద్దరం 'జీవ సేవ ఆశ్రమం'లో ఉంటాం. ఆవిడకి పాపం బాగోలేదు. ఎవరో ఒకరు చూడాలిగా... నేను కాస్త ఓపిగ్గా తిరగ్గలను వచ్చాను."

అంటే... ఈవిడ వృద్ధాశ్రమంలో ఉంటారా... అంత వృద్ధమాతగా లేదే... అనుకున్నాను. ఆ మాటే మొహమాటంగా అడిగాను. గలారున నవ్వింది.

"నేను వృద్ధాశ్రమంలో ఉన్నాను. నాకందరూ వున్నారు. కొడుకులూ, కూతుళ్లూ... వాళ్లకి నేను అక్కర్లేదు. వాళ్ల డబ్బూ సేవా నాకూ అక్కర్లేదు. ఇక్కడ నేను కావల్సినవాళ్ళకి సేవ చేస్తున్నాను... మావారు నాకే ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసి వెళ్ళిపోయారు.. ప్రాణమున్నంతకాలం

ఆనందంగా వుంటాను. ఆయన ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాయిగా వెళ్ళిపోతాను"

అప్రయత్నంగా అన్నాను.

"అమ్మా నాకు నీ సేవ కావాలి... మా ఇంట్లో ఉంటావా?"

"సేవా?" నవ్వు ఆపుకుని అడిగింది ఆమె-

"కాదు... నువ్వు కావాలి... నాకు అమ్మకావాలి.... నాతో ఉంటావా" నన్ను నేను సర్దుకుని అడిగాను.

ఆవిడ నా నుదుట మీద చేయి పెట్టి చల్లగా నిమిరింది.

చల్లగా నవ్వింది. "నీకు పూర్తి ఆరోగ్యం వచ్చేదాకా నీతో ఉంటాను- సరేనా..." అంది.

ఆ తర్వాత మా సరస్వతి వచ్చాక... ఆమెని పరిచయం చేశాను... సరస్వతికి ఆవిడ ప్రేమ ఎంతో నచ్చింది... అత్తగారిలా కాదు... అమ్మగా కనిపించిందిట... పెద్దావిడకి మా కథ చెప్పబోయాం మేమిద్దరం.

ఆవిడ ఆపి... "కలవరింతల మగతలో నీ కథంతా నేను విన్నాను నాన్నా" అంది "సరస్వతి నీ ప్రాణదీపం- నువ్వాపిల్లకి నుదుటి తిలకం" అంది.

ఆ తర్వాత ఆవిడ చాల రోజులు మా ఇంట్లో ఉండి 'వెళ్లిపోతా మా ఆశ్రమానికి' అన్నప్పుడు ఇద్దరం ఏడిచేశాం-

"పిచ్చాళ్లల్లారా... మీకింక నా అవసరం పూర్తయింది. నాకు మీ అవసరం కావాలంటే నేనే వస్తాను" అంది.

అంత మంచి మనిషికి మా అవసరం రాకూడదని గుండెనిండా అనుకున్నాం-

ఆమె మాకు దేవుడిచ్చిన తల్లి.